


***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే
# *చివరి విడత: మలి సందడి (35)*

## మరో దేవుడు

క్రైస్తవ మతాచార్యులు వెళ్లిపోయేక నేను, శ్రీమతి కూడా మామూలు మనుషులం కావడానికి కొంతసేపు పట్టింది. తర్వాత జరిగింది కలా, నిజమా అని కాసేపు అనుకున్నాం. చివరికి శ్రీమతి, "మీ గురించి ఏమో అనుకున్నాను. కరడు కట్టిన హిందూత్వవాదులు మీరు" అంది. ఆమె ఉద్దేశ్యంలో అది ప్రశంస.

మా ఇంట్లో నన్ను నాస్తికుడని నిరసిస్తారు. మిత్రులు చాలామంది నేను సంప్రదాయాన్ని పాటించనని అనుకుంటారు.

ఐతే నా అలవాట్లు చూసి, అందుకు కారణం– దైవభీతి, పాపభీతి అని నిర్ధారించినవారూ ఉన్నారు.

ఇప్పుడు శ్రీమతి ఏకంగా కరడు కట్టిన హిందూత్వవాదిని అనేసింది.

వేరే మతంలో చేరడానికి విముఖత చూపడం– కరడు కట్టిన హిందూత్వవాదమౌతుందా?

ఆమె ప్రశంస నన్ను కాస్త ఇబ్బంది పెట్టినా, నేను శ్రీమతి మాటని ఖండించలేదు. ఎందుకంటే– మతాన్నీ దేవుణ్ణీ సీరియస్‌గా తీసుకోని నేను మొహమాటానికి లోనై మతం కానీ మార్చేసుకుంటానేమోనన్న అనుమానం, భయం ఆమెని వేధించాయని నాకు తెలుసు. అలా జరక్కపోయేసరికి ఆనందం పట్టలేక నాకా బిరుదునిచ్చింది.

నేనా బిరుదుని సీరియస్‌గా తీసుకోనక్కర్లేదు. ఐనా అది నేనేం లెటర్‌హెడ్మీద వ్రాసుకోను కదా!

నేనేమిటో తనకి తెలుసు. అది సాహచర్యంలో వ్యక్తమౌతూనే ఉంటుంది.

సందర్భాన్ని బట్టి ఆమె నాకిచ్చే బిరుదులూ మారొచ్చు. ప్రస్తుతానికి వచ్చింది మౌనంగా స్వీకరించడం మేలు. మౌనం అర్ధాంగీకారం అని ఆమె అనుకోవచ్చు. కానీ అర్ధాంగీకారమే కదా!

"ఇంటర్వ్యూల్లో గెలుపు లభిస్తే– ఒకోసారి నా ప్రతిభకు మురిసిపోతాను. ఒకోసారి కలిసొచ్చిన అదృష్టానికి పొంగిపోతాను. కానీ ఈరోజు జరిగిన మతాల చర్చలో నాది గెలుపైతే కనుక, అందుకు కారణం– ఎదుటివారి అసమర్థతే తప్ప నా ప్రతిభా కాదు, అదృష్టమూ కాదు. నిజం చెప్పాలంటే నా గెలుపు నన్ను ఆశ్చర్యపర్చింది. ఎందుకంటే సంఖ్యలో తక్కువైనా, ఈ ప్రపంచాన్ని ఏలుతున్నది తెల్లవారే, ఆ కారణంగా ప్రపంచంలో అధికసంఖ్యాకులు అనుసరిస్తున్నదీ, అనుకరిస్తున్నదీ వారి సంస్కృతే! అందుకు కారణం వారు ప్రశ్నించే గుణాన్ని ప్రోత్సహించే సంప్రదాయాన్ని పాటించడం,

శాస్త్రీయంగా నిర్ధారించిన విషయాల్నే నమ్మడం. అలాంటివారు దేవుడిపై నమ్మకంతో ఓ మతాన్ని స్వీకరించారంటే, వారి మతప్రవక్తలు వివేకానందుడి లెవెల్లో ఉంటారనుకున్నాను. మతప్రచారానికి మనవద్దకొచ్చిన మతాచార్యుల ప్రదర్శన– అంత పేలవంగా ఉండడం ఆశ్చర్యం కదూ! దీన్నిబట్టి ఒక విషయం స్పష్టమౌతోంది. ఇదీ అదీ అని లేదు– ఏ మతమైనా మనిషి తెలివిని కరడు కట్టిస్తుంది. నీరు కరడు కడితే మంచుగడ్డ ఔతుందికదా! మంచుగడ్డ, నీరు– వీటిలో మనిషికి ఏది ఎక్కువ మేలు చేస్తుందో, ఏది ఎక్కువ అవసరమో తేల్చుకుని– అప్పుడు తెలివిని కరడు కట్టించడం గురించి ఆలోచించాలి. ఏది ఏమైనా ఈ రోజు మనకు జీవితంలో మరచిపోలేనిది" అన్నాను.

"నీరు, మంచుగడ్డ విషయమై అంత ఆలోచనెందుకూ– పదార్థాలు పాడవకుండా మంచుగడ్డని వాడతాం. మిగతా అవసరాలకు మంచినీళ్లు వాడతాం" అంది శ్రీమతి.

చాలా మమూలుగా అనేసిందామె. నేను మాత్రం 'మానిషాద ప్రతిష్ఠాంత్వ' విన్న నారదుడిలా థ్రిల్లైపోయాను.

అప్పుడు నాకు చిన్నప్పుడు చదివిన ఓ కథ గుర్తొచ్చింది.

పాండిత్యంలో తనకు సాటి లేరని విర్రవీగే ఓ అహంకారి పండితుడు, ఎక్కడెక్కడి పండితుల్నీ జయించాలని బయల్దేరి ఓ ఊరెళ్లాడు. పొలిమేరల్లో ఆయనకు ఓ పామరుడెదురై, ఆయన ఆంతర్యం తెలుసుకున్నాడు. వాడు వెంటనే నేలమీంచి గుప్పెడు మట్టిని తీసి, "ఇందులో ఎంత మట్టి ఉందో చెప్పండి. తర్వాత వెళ్లి మా ఊరి పండితుల్ని ఓడిద్దురుగాని" అన్నాడు. పండితుడా మట్టి ఎంత బరువుంటుందో, దాంట్లో ఎన్ని రేణువులున్నాయోనని ఆలోచనలో పడ్డాడు. ఎప్పటికీ ఆలోచనలు తెగడం లేదు. పామరుడు కాసేపాగి, "ఇంత చిన్న ప్రశ్నకి జవాబుకోసం అంత ఆలోచించాలా? ఇక మా ఊరి మహాపండితుల ప్రశ్నలకు ఎలా తట్టుకుంటారు?" అని గేలి చేశాడు. పండితుడు ఆశ్చర్యపడి, "ఇది చిన్న ప్రశ్నా? అయితే జవాబేమిటో నువ్వు చెప్పు చూద్దాం" అన్నాడు. "దాందేముంది? గుప్పెటతో తీశాను. గుప్పెడు మట్టి ఉంది" అన్నాడు పామరుడు.

ఇప్పుడు శ్రీమతి చెప్పిన వివరణ నాకు అంత గొప్పదీ, లోతైనదీ అనిపించింది.

"చాలా బాగా చెప్పావు. తెలివి కరడు కడితే, అది మన వ్యక్తిత్వాల్ని కాపాడాలి. కరడు కట్టని తెలివి జీవన గమనాన్ని సుగమం చెయ్యాలి. అందుకు మనం మనకంటే బలవత్తరమైన శక్తిని నమ్మాలి. అదే కొందరికి దేవుడు. తెలివి కరడు కట్టకపోతే ఆ దేవుడు– కృష్ణుడే కాదు, క్రీస్తూ కావచ్చు. రాముడే కాదు, రహీమూ కావచ్చు. వీళ్లెవరూ కాకుండా ఏ సాయిబాబాయో, ఇంకెవరో కావచ్చు" అన్నాను.

"ఇలా అనుకోవడం మొదలెడితే– వీళ్లెవరూ కాకుండా మనకు తెలిసిన మరో మనిషే దేవుడు కావచ్చు" అని నవ్వింది శ్రీమతి.

"బాలవాక్కు బ్రహ్మవాక్కు అంటారు బాలా! నీ మాటే నిజం కావచ్చేమో!" అన్నాను.

ఆ మాట సరదాకి యథాలాపంగా అన్నాను కానీ అది నిజమౌతుందని అప్పుడనుకోలేదు.

సందర్భానికి అనువుగా ఉంది కాబట్టి, వరుసక్రమంలో ముందున్న కొన్ని విశేషాల్ని వెనక్కి నెట్టి– ఈ విశేషాన్ని ముచ్చటిస్తాను.

ఆ రోజు మధ్యాహ్నం ఆఫీసులో అప్పుడే ఓ శాంపులుకి సర్ఫేస్ ఏరియా మెజర్మెంటుకి లిక్విడ్ నైట్రోజన్ కలెక్ట్ చేస్తున్నాను. మ్యుల్లర్ వచ్చి, "అర్జంటుగా నా శాంపులుకి సర్ఫేస్ ఏరియా మెజర్ చెయ్యాలి. ఈ పూటకి ఇన్‌స్ట్రుమెంటు నాకు స్పేర్ చెయ్యగలవా?" అనడిగాడు.

ప్రయోగానికి మానసికంగా ప్రిపేరై ఉన్నాను కాబట్టి స్పేర్ చెయ్యాలనిపించలేదు. కానీ నాకది అర్జంటు కాదు. అదీకాక అలా అడిగితే కాదనడం నా మనస్తత్వానికి సరిపడదు.

ఐతే భువనేశ్వర్లో నా సీనియర్ కొలీగ్ నాకో సలహా ఇచ్చాడు.

ఎవరినైనా అబ్లైజ్ చేసేటప్పుడు వెంటనే ఒప్పేసుకోకూడదుట. కాసేపు తటపటాయించి ఏదో పెద్ద త్యాగం చేసినట్లు పోజివ్వాలిట. అప్పుడే మన సాయానికి విలువుంటుందిట. లేకుంటే, ఎప్పుడు పని తప్పుతుందా అని ఎదురుచూస్తూ, అడగ్గానే హమ్మయ్య అని ఒప్పేసుకున్నామని అనుకుంటారుట.

అది కొంతలో కొంత నిజం. కొత్తగా మొదలైన పత్రిక్కి అడగ్గానే అప్పటికప్పుడు రాసి కథ పంపితే, ఏ తిరిగొచ్చిన కథో సిద్ధంగా ఉంటే పంపేశారని అనుకుని నిరాశ పడతారు. పది రోజులు టైమడిగితే పది పత్రికలు తిప్పి పంపిన కథ పంపినా సంతోషిస్తారు.

అది లోకం తీరు అని నాకూ తెలుసు. కానీ షో నా మనస్తత్వానికి సరిపడదు.

ఎలాగూ సరేననేటప్పుడు, తటపటాయించడం కంటే వెంటనే ఓకే చెప్పెయ్యాలనుకుంటాను. అందుకే మ్యుల్లర్ తో సరేనన్నాను.

అది ఒకందుకు నాకు మంచిదే అయింది. ఎందుకంటే సరిగ్గా అప్పుడే అహ్మద్ వచ్చి, "రావ్, నీ భార్యనుంచి ఫోను. అర్జంటుగా మాట్లాడాలిట" అన్నాడు.

మా ఇంట్లో మాకు ఫోను లేదు. ఇంటి బయట పబ్లిక్ టెలిఫోన్ బూత్ ఉంది. అత్యవసర పరిస్థితిలో నన్ను సంప్రదించడానికి శ్రీమతికి మా ఆఫీసు నంబరు ఇచ్చాను కానీ, ఇంతవరకూ అలాంటి అవసరం రాలేదు.

ఏమయిందోనని కంగారు పడుతూ వెళ్లేసరికి, "బాబు కుర్చీలోంచి పడిపోయాడు. ఎప్పుడూ లేంది ఆపకుండా తెగ ఏడుస్తున్నాడు. ఎడం చెయ్యి ముట్టుకుంటే చాలు బేరుమంటున్నాడు" శ్రీమతికి దుఃఖమొచ్చి ఆగిపోయింది.

ఇలాంటి కబురు వింటానని ఊహించలేదు. శ్రీమతి చెప్పింది ఆకళింపు చేసుకుందుకు కొంచెంసేపు పట్టింది.

"ఎలా జరిగింది?" అన్నాను.

మాకు ప్రసాద్ దంపతులు పరిచయమైనట్లు చెప్పాను కదా, వాళ్లిల్లు మా ఇంటికి మరీ దూరం కాదు.

ప్రసాద్ ఆఫీసుకి వెళ్లేక, శ్రీమతి ప్రసాద్ సాధారణంగా ఇంటి పనులతోనో, వంటింటి షాపింగుతోనో బిజీగా ఉంటుంది. ఎప్పుడైనా ఒంటరితనం ఫీలయితే కాలక్షేపానికి తెలిసినవాళ్ల ఇంటికెడుతుంది.

కన్నబిడ్డని, పసివాణ్ణి ఇండియాలో వదిలి రావాల్సొచ్చిందేమో– ఆమెకి పిల్లలున్న మా ఇల్లో స్పెషల్ అట్రాక్షన్. అలాగని ఆమె వాళ్లతో ఆటలాడదు.

“పిల్లలకి వాళ్లీడు వాళ్లతోనే బాగుంటుంది. మనం చేరదీస్తే, మొహమాటానికి కబుర్లు చెప్పినా, మనసులో బోర్ ఫీలౌతారు. వాళ్ల మానాన వాళ్లని ఆడుకోనివ్వాలి. వాళ్ల ఆటలు చూస్తూ మనం కబుర్లు చెప్పుకోవడం అదో ఆనందం” అంటుందామె.

ఆమె ప్రాక్టికల్ అప్రోచ్ కారణంగానే మా పిల్లలకి కూడా ఆమె ఫావరేట్ విజిటర్.

చాలామందికి పిల్లల్ని చేరదియ్యడం ఓ షో. పిల్లల ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా, వాళ్లని విసిగిస్తున్నామని గమనించకుండా, తమ షోని కొనసాగిస్తారు. అలాంటి షోకి సంబంధించిన విశేషాలు తర్వాత ప్రస్తావిస్తాను.

ఆ రోజు మధ్యాహ్నం శ్రీమతి ప్రసాద్ మా ఇంటికొచ్చింది. పిల్లలు వాళ్ల ఆటల్లో ఉంటే, పెద్దవాళ్లిద్దరూ కబుర్లలో పడ్డారు.

కాసేపటికి బాబుకి నిద్ర వస్తున్నట్లుంది. అక్కని వదిలి అమ్మ ఒడిలో చేరాడు. వాళ్ల కబుర్లు ఔతుండగానే వాడికి నిద్ర పట్టేసింది.

కాసేపటికి శ్రీమతి ప్రసాద్, వెళ్లడానికి లేచింది. శ్రీమతి తనూ కుర్చీలోంచి లేస్తూంటే, అనుకోకుండా బాబు ఒళ్లోంచి జారి కింద పడ్డాడు.

అంతే! ఏడుపు మొదలెట్టాడు.

ముందు భయపడ్డాడని అనుకుంది. కానీ శ్రీమతి ప్రసాద్ వాణ్ణి చూసి, “ఎడం చెయ్యి కొంచెం వంపు తిరిగినట్లుంది. పడడంలో దెబ్బ కాస్త గట్టిగా తగిలిందేమో!” అంది.

చూస్తే నిజమే! చెయ్యి విల్లులా వంగి ఉంది. అక్కడ ముట్టుకుంటే ఘొల్లుమంటున్నాడు.

శ్రీమతి బాబుని మంచంమీద జాగ్రత్తగా పడుకోబెట్టింది.

పాప కంగారు పడుతుంటే, “తమ్ముడికి నిద్రొస్తోంది. అమ్మ పడుకోబెడుతోంది” అని శ్రీమతి ప్రసాద్ పాపని దగ్గరకు పిలిచి మాటల్లో పెట్టింది.

బాబు కాసేపు ఏడ్చినా తొందరగానే నిద్రపోయాడు. అప్పుడు శ్రీమతి ప్రసాద్, “మీరు కిందకెళ్లి పబ్లిక్ బూత్ నుంచి మీ వారికి ఫోన్ చెయ్యండి. నేను పాపని చూసుకుంటుంటాను” అంది.

శ్రీమతి ఈ వివరాలు చెబుతూ మధ్యమధ్య దుఃఖంతో గొంతు పెగలక తడబడుతోంది.

బాబు తల్లి ఒడిలోంచి కింద పడీ పడగానే ఏడుపు మొదలెట్టాడంటే నాకూ దుఃఖమొచ్చింది.

వాడెప్పుడూ నవ్వుతూ ఉంటాడు. ఆటపాటల్లో ఎప్పుడైనా కింద పడ్డా, దెబ్బ తగిలితే తప్ప పట్టించుకోకుండా, మళ్లీ లేచి తన ఆటపాటల్లో మునిగిపోతాడు. దెబ్బ తగిలినా మా ఓదార్పు లభించగానే దాని గురించి మర్చిపోతాడు. అలాంటిది ఆపకుండా ఏడుస్తున్నాడంటే, నొప్పి ఎక్కువగా ఉండిఉండాలి. చెయ్యి ముట్టుకుంటే ఏడుస్తున్నాడంటే– ఎముక కానీ విరిగిందా– అని కూడా అనుమానమొచ్చింది.

ఆ అనుమానం రాగానే నాకు వళ్లంతా జలదరించింది.

ఎముక విరగడమంటే– అది చాలా పెద్ద సమస్య ఔతుందని నా భయం.

కానీ మేముండే ఇంట్లో నేల చెక్కది. మేమంతా కూర్చునే కుర్చీలు చెక్కవి. అవీ ఎత్తైనవి కూడా కాదు.

చెక్క కుర్చీలోంచి కాస్త ఎత్తుమీంచి చెక్కనేలమీద పడితే, ఎముక విరిగేటంత దెబ్బ తగుల్తుందా?

మనసుకి ధైర్యం చెప్పుకుని, తర్వాత శ్రీమతికి కూడా అదే చెప్పాను.

ఆమె కొంచెం తేరుకుని, "ఏమో, వాడి ఎడం చెయ్యి మాత్రం విల్లులా వంగింది. ఏడ్చి ఏడ్చి ఇప్పుడే పడుకున్నాడు. అందాకా ప్రసాద్ గారి భార్యని పాపకీ, వాడికీ కాపలా పెట్టి బయటికొచ్చి ఈ ఫోన్ చేస్తున్నాను" అంది శ్రీమతి.

మళ్లీ నా ధైర్యం దిగజారింది. చెయ్యి వంపు తిరిగిందంటే, ఎముక విరిగే ఉండాలి.

ఇప్పుడేం చెయ్యాలి?

ఇండియాలో ఉండగా– నాకు ఆస్పత్రి అనుభవం లేదు.

చిన్నప్పుడు జలుబు, దగ్గు, తలనొప్పి, అజీర్ణం వంటి వాటికి గృహవైద్యం చేసేవారు. జ్వరమొస్తే లంకణాలతో తగ్గేది. టెంపరేచరు కాస్త ఎక్కువైతే ఎవరైనా ఆస్పత్రికి వెళ్లి లక్షణాలు చెప్పి అరకు తెచ్చేవారు. రెండు మూడు రోజుల్లో తగ్గిపోయేది.

ఉద్యోగంలో చేరిన కొత్తలో నాకు బాగా రొంప పట్టింది. ఆఫీసులో కొలీగ్ నా అవస్థ చూసి, 'కాలనీలో డిస్పెన్సరీ ఉందిగా, డాక్టర్ని కలు. వెంటనే రిలీఫొస్తుంది" అన్నాడు. అప్పట్లో మా డిస్పెన్సరీకి డాక్టర్ నందా అని పేరుపొందిన ముసలాయన వచ్చేవాడు. ఆయన నన్ను సమస్యేమిటని అడిగి తెలుసుకుని, "నీకు పట్టింది రొంప. మందేసుకుంటే వారం రోజుల్లో తగ్గుతుంది. మందు వాడకపోతే ఏడు రోజుల్లో పోతుంది. మందివ్వనా?" అన్నాడు.

అప్పట్నించి ఇంతవరకూ– ఎంత రొంప పట్టినా సరే, నేనే కాదు నా శ్రీమతి కూడా డాక్టర్ని కలవలేదు. ఆయన చెప్పినట్లే అది వారంకంటే తక్కువ రోజులే కానీ, ఎక్కువ రోజులు బాధించలేదు.

అలాంటి నాకు– ఈ పరాయి దేశంలో ఇలాంటి సమస్య వచ్చేసరికి కాళ్లూ చేతులూ ఆడలేదు.

పోతన – 'సిరికింజెప్పడు' పద్యం ఊరికే వ్రాయలేదు. శ్రీమతికి ఏంచెప్పాలో తోచక, "ఏంచేద్దాం?" అన్నాను.

"రావుగారికి ఫోన్ చెయ్యండి. ఈ సమయంలో సలహాకీ, సాయానికీ ఆయన తప్ప ఇంకొకరు లేరు" అంది శ్రీమతి.

ఇలాంటప్పుడే మగాళ్లు గాబరా పడిపోతే, ఆడవాళ్లు పరిష్కారంవైపు చూస్తారు.

నేనేదో పరిష్కారమార్గం చెబుతానని కాదు, తనకు తోచిన పరిష్కారమార్గాన్ని అమలు చెయ్యడానికి నాకు ఫోన్ చేసింది తను.

రావుగారి పేరు వినగానే నాకు కొండంత ధైర్యం వచ్చింది. అందులో సగం ధైర్యాన్ని శ్రీమతికి బదిలీ చేసి, "నేను రావుగారితో మాట్లాడతాను. నువ్వు ఫోన్ పెట్టేసి ఇంటికెళ్లి, శ్రీమతి ప్రసాద్ గారిని రిలీజ్ చెయ్యి" అని చెప్పి, రావు గారింటికి ఫోన్ చేశాను.

అది రావుగారు ఆఫీసులో ఉండే టైము. పిల్లలు పుట్టేక, ఉద్యోగం మానెయ్యడంవల్ల కానీ, లేకుంటే రావుగారి భార్య సత్యవతిగారు కూడా ఇంట్లో ఉండేది కాదు/

ఫోను సత్యవతిగారు తీసింది. నేను ఫలానా అని చెప్పగానే, ఆయన ఆఫీసులో ఉన్నారని చెప్పి, విశేషాలు అడిగింది. నేను వెంటనే జరిగింది చెప్పాను. ఆ చెప్పడంలో– జపాన్ మీద బాంబు పడిందన్నంత బిల్డప్పుంది.

ప్రమాదం చిన్నదే కావచ్చు. కానీ నాకిది కొత్త. అందుకే అప్పుడలా ఫీలయ్యాను.

ఆమె వెంటనే, "అయ్యో" అని సానుభూతి ప్రకటించింది. "మీరు వెంటనే ఇంటికెళ్లి, మీవాళ్లని వెంటబెట్టుకుని, మా ఇంటికొచ్చెయ్యండి. అప్పటికి రావుగారు కూడా ఆఫీసునుంచి వచ్చి, బాబుని హాస్పిటలుకి తీసుకెడతారు. మీరేం కంగారు పడకండి" అని ధైర్యం చెప్పింది.

ఆ మాటలతో మనకిక్కడ మనవాళ్లున్నారు అన్న ధైర్యం వచ్చింది. థాంక్స్ చెప్పి ఫోన్ పెట్టేశాను.

ఇంటికెడుతున్నట్లు అహ్మద్‌కి చెప్పాను.

అతగాడు నా ముఖకవళికలు చూసి, "ఉన్నట్లుండి డల్ ఐపోయావేమిటి? ఏమయింది?" అనడిగాడు.

అబద్ధమెందుకూ– పైకి కనబడకపోయినా, నా మనసులో ఇంకా చాలా దుఃఖంగా ఉంది. సానుభూతి కావాలనిపించిందేమో, అతడికి జరిగింది చెప్పాను.

ఆశ్చర్యంగా అతడు ఓదార్చడానికి బదులు పకపక నవ్వాడు.

"నువ్వెప్పుడూ, ఆటల్లో దెబ్బలు తగిలించుకోలేదా? చెట్లెక్కి పడలేదా?" అన్నాడు అదేదో మామూలు విషయమైనట్లు.

"లేదు" అన్నాను.

"అంటే నువ్వు చిన్నప్పుడు ఆటలాడలేదు. చెట్లెక్కలేదు. ఏం బాల్యం నీది?" అన్నాడు అహ్మద్ నిరసనగా.

నాకు ఉక్రోషమొచ్చింది.

చిన్నప్పుడు నా ఆటలన్నీ నదీజలాలు, పొలాలు, తోటలు– వీటి మధ్యనే నడిచాయి. చెట్లకూ మా ఆటలకూ అవినాభావసంబంధం ఉండేది. నా బాల్యం నాకెంతో మధురం.

“దెబ్బలు తగిలించుకుంటేనే బాల్యమా? చిన్నప్పుడు మా పక్కింట్లో ఓ అల్లరి కుర్రాడు ఉండేవాడు. అతణ్ణి స్కూల్లో టీచర్లూ, ఇంట్లో వాళ్ల నాన్నా చితకబాదేవారు. ఎప్పుడైనా వాడిమీద జాలి పడితే, ‘పెద్దాళ్లచేతా, మేస్టర్ల చేతా దెబ్బలు తినడం అదో మజా! అది లేని బ్రతుకు వృథా’ అనేవాడు. అలా ఉంది నీ మాట!” అన్నాను.

అహ్మద్ మళ్లీ నవ్వి, “వాడన్నది కరెక్టే కదా! యుద్ధానికి వెళ్లొచ్చినవాడికి ఎన్ని గాయాలుంటే అంత గొప్ప. అలాగే బాల్యంలో దెబ్బలూనూ” అన్నాడు.

“చిన్నప్పుడు దెబ్బలు నాకూ తగిలాయి. కానీ కాలూ చెయ్యీ విరగలేదు” అన్నాను.

“అందుకే ఇప్పుడు మీ అబ్బాయి కుర్చీలోంచి పడ్డాడనేసరికి తెగ హైరానపడిపోతున్నావు. మరి చిన్నప్పుడు నాకు ఆటల్లో ఎన్నోసార్లు దెబ్బలు తగిలాయి. ఒకసారి కాలు, ఒకసారి చెయ్యి విరిగాయి. ఆడుకునే వయసులో పిల్లలకిది మామూలే. ఎముక విరిగినా సులభంగా అతుక్కుపోవడమే కాదు, పూర్వంకంటే బలమౌతుంది” అన్నాడు.

అప్పటికి నాకు అహ్మద్ ఆంతర్యం అర్థమైంది. అతగాడు నన్ను వేళాకోళం చెయ్యడంలేదు. నాకు ధైర్యం కలిగించడానికి జరిగిన ప్రమాదాన్ని, తనదైన పద్ధతిలో తక్కువ చేసి చెప్పాడు.

అతడు చెప్పింది నిజమే!

మా వాడు పడింది కుర్చీలోంచి. అదీ బయట కాదు ఇంట్లో.

ఆ మాత్రానికే మిన్ను విరిగి మీద పడ్డట్లు ఫీలయ్యానంటే— ఇలాంటి విషయాల్లో ఉండాల్సినంత రఫ్ అండ్ టఫ్‌గా లేననేగా అర్థం.

అహ్మద్‌కి థాంక్సు చెప్పాను. అతడు వెంటనే, “అవసరమైతే నేనూ వస్తాను” అన్నాడు ఆత్మీయంగా.

“ఇంత చిన్నదానికి నువ్వెందుకూ! నీ అవసరం కలిగేటంత పెద్దసమస్య నాకు రాకూడదని అల్లాని ప్రార్థించు. ఇప్పటికది చాలు” అన్నాను.

“రావ్! బహుశా నువ్వు హాస్పిటలుకి వెళ్లాలి. ఇన్సూరెన్సుందిగా, ఆ కాగితాలు తీసుకెళ్లడం మర్చిపోకు” అన్నాడు అహ్మద్.

నాకసలు ఇన్సూరెన్సు సంగతే గుర్తు లేదు. బెర్లిన్ వచ్చినప్పుడు నన్ను ఇన్సూరెన్సుకి ప్రోత్సహించిందే– అహ్మద్! ఫారం ఫిల్ చేస్తున్నప్పుడు అతడు నా పక్కనే ఉన్నాడు. సరైన సమయానికి ఇన్సూరెన్సు విషయం గుర్తు చేశాడంటే,

అతగాడు నా సమస్య గురించి ఎంత లోతుగా ఆలోచిస్తున్నాడో తెలుస్తుంది. 'ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్– అనే సామెత ఊరికే పుట్టలేదు' అనుకుంటూ– అతడికి స్నేహపూర్వకంగా థాంక్సు చెప్పి అక్కణ్ణించి బయల్దేరాను.

అప్పటికి మనసు కొంత తేలిక పడింది. కానీ ఇల్లు చేరగానే శ్రీమతి నన్ను చూసి భోరుమనేసరికి మళ్లీ దుఃఖమొచ్చింది. అంతలో పాప పరుగున దగ్గరకొచ్చి నన్ను గట్టిగా పట్టుకునేసరికి, అది బాగా భయపడిందని అర్థమై, నా దుఃఖాన్ని పళ్ల బిగువున ఆపుకున్నాను.

ఐతే మంచంమీద నిద్ర పోతున్న బాబుని చూడగానే పితృహృదయం ద్రవించిపోయి దుఃఖం ఆగలేదు.

ఏడ్చి ఏడ్చి పడుకున్నట్లు వాడి మొహం చూడగానే తెలుస్తోంది. ఎడంచెయ్యి ధనుస్సులా వంగి ఉంది.

కొంచెం తమాయించుకుని సత్యవతిగారన్నది చెప్పి, వెంటనే సిద్ధం కమ్మన్నాను.

నేను అహ్మద్ చెప్పిన ఇన్సూరెన్సు కాగితాలకోసం వెదికాను.

మాకు సంబంధించిన ముఖ్యమైన కాగితాలన్నీ ఒకచోటే ఉండడంతో ఆ కాగితాలు సులభంగానే దొరికాయి.

కాగితాలంటే నెలనెలా వచ్చే రసీదులు. వాటితోపాటు మా నలుగురికీ నాలుగు చెక్కు పుస్తకాలలాంటివి ఉన్నాయి.

వాటిలో బాబు పేరున ఉన్న పుస్తకం తీశాను.

మేము వచ్చి చాలా నెలలే అయినా అంతవరకూ ఆ పుస్తకాల అవసరం కలుగలేదు. రాకూడదనే అనుకున్నాం కూడా.

వాటినెలా వాడాలో తెలియదు. నాకు తెలిసినంతవరకూ– ముందు వైద్యానికి డబ్బు కట్టి రసీదు తీసుకోవాలి. ఆ రసీదులు జతపరుస్తూ, ఇన్సూరెన్సు వాళ్లకి అప్లై చేసుకోవాలి. వాళ్లు తమ రూల్సు ప్రకారం ఇచ్చిందిస్తారు. వచ్చిందే చాలని సరిపెట్టుకోవాలి.

ఐతే మన దేశంతో పోల్చితే, ఇక్కడ హాస్పిటల్ చార్జిలు చాలా ఎక్కువని విన్నాను. నేను కట్టే ఇన్సూరెన్సు ప్రీమియం– ఏదో నామమాత్రం!

అంతకుమించి ఎక్కువ ఆలోచించడానికి సెంటిమెంటు అడ్డొచ్చింది.

అవతల బాబుకి చికిత్స అవసరం. నేను చికిత్స గురించే తప్ప ఖర్చు గురించి ఆలోచించకూడదు.

శ్రీమతి, పాప డ్రెస్సయ్యారు. బాబుకి బట్టలు మార్చలేదు. వాణ్ణి శ్రీమతి జాగ్రత్తగా ఎత్తుకుంది.

ఎత్తుకుంటుంటే బాబుకి మెలకువొచ్చి ఏడుపు మొదలెట్టాడు.

ఎత్తుకోవడంలో దెబ్బ తగిలిన చోట చెయ్యి తగిలిందేమో అనుకున్నాను కానీ, అదేం కాదు.

ఈ ప్రపంచంలో అమ్మ ఒక అద్భుతం. శిక్షణ పొందిన శస్త్రచికిత్సా నిపుణులను మించిన సున్నితత్వం చూపగలదు– తల్లి తన పిల్లల విషయంలో.

బాబు భయంతో ఏడ్చాడంతే!

“మనం డాక్టరు దగ్గరికి వెడుతున్నాం. ఆయన మందేస్తే నొప్పి తగ్గిపోతుంది. అందాకా ఏడవకూడదు. ఏడిస్తే దాక్టరుగారు నవ్వుతారు” అని శ్రీమతి వాడికి చెప్పింది.

ఆ మాటలే వాడికి ఎనస్తీసియా. ఇక నిజంగా నొప్పి వేస్తే తప్ప ఏడవడు.

ఇంట్లోంచి బయటపడి నడిచి డాయిచే ఓపర్ ఊబాన్‌హాఫ్ చేరుకున్నాం. అక్కణ్ణించి తదుపరి హాల్టులో దిగి నడుచుకుంటూ, క్నెసేబెకె స్ట్రాసే లోని రావుగారిల్లు చేరాం.

ఆ ప్రయాణంలో బాబు ఎక్కడా కిమ్మనలేదు. అందుకు వాణ్ణి మెచ్చుకోవాలి. నేను మాత్రం శ్రీమతికే ఎక్కువ మార్కులు వేశాను.

మేము వెళ్లేసరికి రావుగారింకా అఫీసునుంచి రాలేదు. సత్యవతిగారు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించింది.

బాబుని వాళ్లింట్లో సోఫాలో పడుకోబెట్టేక, “అబ్బే, కంగారు పడాల్సిందేం లేదు. చాలా చిన్న దెబ్బ. ఎటొచ్చీ డాక్టర్ని కలవాలి. అంతే!” అంది సత్యవతిగారు.

ఆ క్షణంలో ఆమెనే డాక్టరుగా ఫీలై, ఆ మాటలకు కొంత ఉపశమనం పొందాం.

ఓ పావుగంటలో రావుగారొస్తే, నేనెళ్లి తలుపు తీశాను.

ఆయన నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. లోపల శ్రీమతి కూడా కనబడ్డంతో మరింత ఆశ్చర్యపోయాడు. అంతలోనే తమాయించుకుని, “ఊరక రారు మహాత్ములు” అన్నాడు.

ఆయన తీరే అంత! చాలా తొందరగా సరదా మూడులోకి వచ్చేస్తారు, తెచ్చేస్తారు.

ఆహ్వానంమీద తప్ప కుటుంబసమేతంగా ఒకరిళ్లకి వెళ్లే అలవాటు మాకు లేదు. అందుకే ఆయనలా అన్నారు.

“మేము ఊరక రాని మాట నిజం. అందువల్ల మహాత్ములమైపోతే, మాకు ఓకే. కానీ మేమొచ్చింది మిమ్మల్ని మహాత్ముణ్ణి చెయ్యడానికి” అన్నాను.

రావుగారు వెంటనే, “ఇది చాలా అన్యాయం. ఇప్పటికే మహాత్ముణ్ణి. ఇంకా నన్ను మహాత్ముణ్ణి చెయ్యడమేమిటి?– ఇది నాకు చిన్నతనం” అని ఓ క్షణమాగి, శ్రీమతివైపు తిరిగి, “రావుగారు నన్ను చిన్నబుచ్చుతారనుకోను. డాక్టర్ల ప్రిస్క్రిప్షను మందుల షాపువాడే చదవగలడు. భర్త మాటల అర్థం భార్య మాత్రమే చెప్పగలదు. కాస్త మీవారి మాటలకు అర్థం వివరిస్తారా?” అన్నాడు.

శ్రీమతి మాట్లాడబోయింది. దుఃఖం తన్నుకురాగా కన్నీళ్లాగలేదు. చీర చెంగుతో ఒత్తుకుంది.

రావుగారు తెల్లబోయి, “ఏమైందండీ-....?” అన్నాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments